క్లుప్తంగా

అమలాపురం పట్టణ సీఐగా దుర్గా శేఖరరెడ్డి


సీఐ దుర్గా శేఖరరెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ సీఐగా ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి ఆదివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన ఎస్‌సీ హెచ్ కొండలరావు ఏసీబీకి బదిలీ అయిన సంగతి తెలిసిందే. అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐగా పనిచేస్తున్న దుర్గాశేఖర్‌రెడ్డి బదిలీపై పట్టణ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం పట్టణంలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతానన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

నేటి నుంచి యూడీసీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో యూడీసీ(అప్పర్ డివిజినల్ క్లర్క్)పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పుదుచ్చేరి ఆది ద్రావిడ, షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ప్యాడ్కో) ద్వారా ఉచిత కోచింగ్ తరగతులను ఈ నెల 13 సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.దయాలన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గోపాల్‌నగర్‌లోని అంబేద్కర్ విజ్ఞాన భవన్ సెమినార్ హాలులో రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక నివేదికపై సమీక్ష

యానాం: పుదుచ్చేరి ఆర్థిక నివేదికపై శనివారం స్థానిక అసెంబ్లీ కాంప్లెక్స్‌లో సమావేశమైన కేబినెట్ చర్చించింది. సీఎం రంగసామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు నమశ్శివాయం, లక్ష్మీనారాయణ, సి.జయకుమార్, చంద్రప్రియాంక, జె.శర్వణన్‌కుమార్, ప్రధానకార్యదర్శి రాజీవ్‌వర్మ, కలెక్టర్ మణికంఠన్, వివిధ ప్రభుత్వ కార్యదర్శులు సమావేశమయ్యారు. ఈ నెల 13 సోమవారం 2022–23 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.11,600 కోట్లతో సభలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఆర్థిక నివేదిక స్థితిపై చర్చించారు. ఆర్థిక నివేదికలో భారీప్రాజెక్టులు, నిధుల కేటాయింపు, తదితర అంశాలపై కార్యదర్శులతో మాట్లాడారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదు

యానాం: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను బీజేపీ, ఎన్‌ఆర్‌కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం రెండేళ్లైనా నెరవేర్చలేకపోయిందని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణసామి విమర్శించారు. సోమవారం నాలుగు రీజియన్‌లలోని యూత్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయన మాట్లాడారు. పుదుచ్చేరికి స్టేట్‌హుడ్ ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేవన్నారు. రాష్ట్రానికున్న అప్పులు, ప్రత్యేక ఆర్థిక సహాయం గురించి సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లౌకిక కూటమితో జతకడుతుందని పుదుచ్చేరి ఎంపీ సీటుకు సైతం పోటీచేసి గెలుపొందుతుందన్నారు. నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆనందబాబు నటరాజన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీ వైథిలింగం, మాజీ మంత్రులు షాజహాన్, కల్యాణసుందరం, పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు ఏవీ సుబ్రహ్మణ్యన్, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఐ.పోలవరం: మురమళ్లలో ఉన్న 'రమణయ్య మోక్ష భూమి' నిర్మాణానికి దాతలందించిన సహకారం మరువలేనిదని పలువురు వక్తలన్నారు. మురమళ్లలో ఆదివారం రమణయ్య బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుల్లాపంతుల బంగారయ్యశర్మ అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్ష భూమికి రూ.90 వేల విలువ చేసే బాడీ ఫ్రీజర్ బాక్సును అందించిన దాతలు మాచిరాజు లక్ష్మీనారాయణ, తుమ్మూరి సత్యనారాయణ, యనమండ్ర సుబ్బారావు, కోసూరి రాంబాబులను సత్కరించారు.

అన్నసమారాధనకు రూ.11 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లిలో వేంచేసిన బాలబాలజీ స్వామి వారి ఆలయంలో నిర్వహించే అన్నదానానికి అమలాపురానికి చెందిన కోరుప్రోలు సత్యశ్రీనివాస్ జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి నాగ సూర్యకాంతం రూ.11,116 ఆదివారం విరాళం అందజేశారు. మార్చి 12న పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతి ఏటా స్వామి వారి శాశ్వత నిత అన్నదాన ట్రస్ట్‌కు విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ చెప్పారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని నాగ సూర్యకాంతంకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, బత్తుల విజయ గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు



వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు


తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న నాయకులు


పాతయింజరం వద్ద వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

వైఎస్సార్ సీపీ ప్రభంజనం పునరావృతం ఖాయం

- పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలి
- ఎంపీ చింతా అనురాధ పిలుపు
- పండగలా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- ఎక్కడికక్కడ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నేతలు, కార్యకర్తలు


వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్ తదితరులు

అల్లవరం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని అలంకరించడం ఖాయమని ఎంపీ చింతా అనురాధ అన్నారు. స్థానిక గుడ్డివాని చింత సెంటర్‌లో వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ అనురాధ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ కుల, మత, రాజకీయ, వర్గ బేధాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా అమలు కావాలంటే 2024లో మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి రావాలని, దీనికోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో దృశ్యకళల చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, మండల కన్వీనర్ తిక్కా ప్రసాదు, మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. గోడిలోని ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ నివాసం వద్ద ఎంపీ చింతా అనురాధ చేతుల మీదుగా 70 మందికి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం పోలమ్మ చెరువు సమీపంలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగా భవానీ, హిత కారిణి సమాజం చైర్పర్సన్ కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఆదివారం స్థానిక హైస్కూలు సెంటరులో వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వేడుకల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పేద మహిళలకు చీరలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్, మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక చెరువుగట్టు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లు కేక్ కట్ చేసి అందరికీ పంచారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: పాతయింజరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ మెర్ల రాణి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు తదితరులు హాజరై దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతి రాజు, ఢిల్లీ నారాయణ, కాటం సత్తిరాజు, పిన్నంరాజు బాబ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన వంతెన వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్ని నిర్వహించారు. సీనియర్ నాయకుడు యేడిది చక్రపాణిరావు చేతుల మీదుగా పార్టీ జెండా ఎగురవేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

ఆక్వాకి ఈహెచ్‌పీ దెబ్బ

- రొయ్యల్లో ఎదుగుదల లోపం
- సైజుల్లో భారీగా తేడాలతో తీవ్ర నష్టాలు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు


అల్లవరంలో సాగు చేస్తున్న రొయ్యల చెరువు


హార్వెస్టింగ్ చేసిన రొయ్యలు


ఈహెచ్‌పీ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకిన రొయ్యలు, రొయ్యల సైజులో తేడాలు

అల్లవరం: మూడు దశాబ్దాలుగా ఆటుపోటులను చవిచూసిన ఆక్వా రంగం గత రెండేళ్ల నుంచి భారీ సవాళ్లని ఎదుర్కొంటుంది. కరోనా మహమ్మారితో రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్ లేక ధరలు పతనం కావడంతో గత రెండేళ్లుగా ఆక్వా రంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. కరోనా తగ్గుముఖం పట్టడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లు తెరుచుకోవడంతో మంచి రోజులు వచ్చినట్లేనని రైతులు భావించారు. ఈ తరుణంలో ఈహెచ్‌పీ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ మరోసారి ఆక్వా రైతుల్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేస్తుంది.

వెంటాడుతున్న ఈహెచ్‌పీ

రొయ్యల ఎగుమతులకు చైనా, అమెరికా తదితర అంతర్జాతీయ మార్కెట్లు తెరుచుకోవడంతో జనవరి నుంచి ఆక్వా రంగం ఊపందుకుంది. వనామీ సాగు పరిచయమయ్యాక ఎకరానికి 2 నుంచి 3 లక్షల వరకు రొయ్య సీడు వేసి అధిక లాభాలు ఆర్జించారు. అయితే రెండేళ్లుగా ఆక్వా రంగం సంక్షోభం దిశగా వెళ్లడంతో ఎకరానికి 50 వేల నుంచి లక్ష వరకు రొయ్య సీడు వదిలి కౌంట్ తీసుకోవడం ద్వారా రిస్కు లేకుండా కల్చర్ ప్రారంభించారు. జనవరిలో ఆక్వా కల్చర్ ప్రారంభించిన రైతులకు నెల రోజులు గడవకముందే వైరస్‌లు వెంటాడడం మొదలైంది. ప్రధానంగా ఈహెచ్‌పీ (ఎంట్రోసైటో జూన్ హెపటోపెనై) మైక్రోస్పోరిడియన్ పరాన్నజీవి ద్వారా వచ్చే ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో ఆక్వా రంగం కుదేలవుతుంది. ఇది సోకిన రొయ్యల సైజుల్లో భారీగా తేడాలుంటున్నాయి. పెద్ద కౌంట్ రొయ్య నుంచి చాలా చిన్న కౌంట్ వరకు ఉంటుంది. రోజులు గడుస్తున్నా రొయ్యల్లో ఎదుగుదల కనిపించకపోవడంతో రైతుకి తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి.

నాణ్యత లేని రొయ్య సీడు వల్లే

నాణ్యత లేని రొయ్య సీడు, నేల, నీరు ద్వారా ఈహెచ్‌పీ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వ్యాపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో వందలాది ఎకరాల్లో రొయ్యల చెరువులు ఈహెచ్‌పీ బారిన పడ్డాయి. గత వారం రోజులుగా ఈహెచ్‌పీ ప్రభావంతో రొయ్యల్లో ఎదుగుదల లేక హార్వెస్టింగ్ చేస్తున్నారు. 50 రోజులు గడుస్తున్నా 250 కౌంట్ రాకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికంగా ఉన్న హేచరీలు నాణ్యత లేని రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తున్నారు. ఇక్కడి నీటిలో ఈహెచ్‌పీ వైరస్ శాతం ఎక్కువగా ఉందని పరిశోధన ల్యాబ్‌లు నిర్ధారించాయి. నాణ్యత లేని రొయ్యల సీడ్‌ని చెరువుల్లో వదిలితే నీరు, నేల కలుషితమయ్యే అవకాశముందని ఆక్వా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రొయ్య సీడ్‌కు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి మంచి ఫలితాలు వస్తేనే ట్యాంక్‌లో వదలాలని ఆక్వా రంగ నిపుణులు సూచిస్తున్నారు. నాణ్యత లేని రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలపై మత్స్యశాఖ అధికారులు నిఘా ఉంచాలని వారు కోరుతున్నారు.

ఎదుగుదల లోపించింది

ఈహెచ్‌పీ ప్రభావంతో 50 రోజులకి 300 కౌంట్ వచ్చింది. రొయ్యల్లో ఎదుగుదల లోపించింది. దీంతో రొయ్యల పట్టుబడి చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎకరన్నర రొయ్యల చెరువులో సాగు చేస్తే రూ.3 లక్షలు నష్టం వచ్చింది. ఈహెచ్‌పీ ఆక్వా రైతులకు తీవ్ర నష్టాలను మిగుల్చుతుంది.

– చెద్లక వీర రాఘవులు(దొరబాబు), ఆక్వా రైతు, సామంతకుర్రు

జీజీహెచ్‌లో మౌలిక సౌకర్యాలపై ప్రస్తావిస్తా

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గానికి సంబంధించి జీజీహెచ్‌లో మౌలిక సౌకర్యాలతో సహా పలు సమస్యలపై పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం చేపట్టాలని కోరనున్నట్లు తెలిపారు. పలు విభాగాలకు సంబంధించి ప్రత్యేక వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాకినాడ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అదే విధంగా డిజిటల్ ఎక్స్‌రే, ఎమ్మారై స్కానింగ్, ఫిజియోథెరపీ తదితర మౌలిక సౌకర్యాల కల్పనపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


తన అనుచరులతో కలిసి ర్యాలీగా వెళుతున్న సంసాని నాగేశ్వరరావు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్ష పదవికి తనని ఎంపిక చేసినందుకు సంసాని నాగేశ్వరరావు తన అనుచరులతో ర్యాలీగా అమలాపురం వెళ్లి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా కాట్రేనికోన గేట్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సానబోయిన నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, గుత్తుల మాణిక్యమోహన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోవధ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

తాళ్లరేవు: తమ ఆవును వధించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని తాళ్లరేవు పరదేశమ్మ పేటకు చెందిన మేడిశెట్టి రాఘవేంద్రరావు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 8వ తేదీన తమ ఆవు తాడు తెంపుకుని వెళ్లియిందని, అన్నిచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు సుంకరపాలెం పంచాయతీ చెరువు సమీపంలో షేక్ ఖలీలా అతని అనుచరులు తమ ఆవును వధించి మేక మాంసంలో కలిపి విక్రయిస్తున్నట్లుగా తెలిసిందన్నారు. గోవధ చేసిన వారిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారమివ్వాలి

తాళ్లరేవు: సాగునీరు అందక వరి పంట ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని మూలపొలం, గ్రాంటు, మూలపొలం, రాజులు కోలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. నెల రోజులుగా నీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయన వెంట ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, లక్ష్మణరావు, రామరాజు వర్మ తదితరులున్నారు.

మధురస్మృతులను నెమరు వేసుకుంటూ..


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

- ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాళ్లరేవు: 37 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. జీవన గమనంలో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అయితే చిన్ననాటి స్నేహితులంతా మళ్లీ తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా అంతా కలిసి ఒకే చోటకు చేరి చిన్ననాటి మధుర మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా ఆదివారం తమ పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు. రోజంతా ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. స్నేహితులంతా కలిసి తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రూ.3 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఉపాధ్యాయులతో ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న చదువుల తల్లి సరస్వతి, స్థలదాత నామన వెంకాయమ్మ విగ్రహాలకు రక్షణగా రూఫ్‌లను నిర్మించారు. కంప్యూటర్ ల్యాబ్‌కు రక్షణగా ఇనుప గ్రిల్స్‌ను నిర్మించడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్‌ను నిర్మించారు. అందరినీ ఒకచోట కలిపేందుకు కృషి చేసిన రోళ్ల చక్రవర్తి, దంగేటి రాంబాబు, అయితంపూడి శ్రీనివాస్, ఎలిపే దేవేశ్వరస్వామి తదితరులను స్నేహితులు అభినందించారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం


గ్రాంటులో వరి దుబ్బులను పరిశీలిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న సాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడతామని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. ఆదివారం పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు, మూలపొలం తదితర ప్రాంతాలలో నెలకొన్న సాగునీటి సమస్యను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గత నెలరోజులుగా సాగునీరు అందక వరిచేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం వరిచేలు పొట్టదశలో ఉన్నాయని, ఈ సమయంలో నీరు లేకపోతే ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని వాపోయారు. ఎంపీపీ వెంట వైఎస్సార్ సీపీ నేత కుడుపూడి శివనారాయణ, రైతులు సూరంపూడి శ్రీనివాస్, పేరాబత్తుల సాయి నరేంద్ర, కావూరి వెంకటేశ్వరరావు, శ్రీను, మహేష్ తదితరులున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ నిజాయితీ


అంగర పోలీస్ స్టేషన్‌లో ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న నాగబాబు

కపిలేశ్వరపురం: రోడ్డుపై దొరికిన రెండు ల్యాప్‌టాప్‌లున్న బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఆలమూరు మండలం సంధిపూడికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తోరాటి నాగబాబు. ఈనెల 11న నాగబాబు కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి నుంచి ఇటుకల లోడుతో ట్రాక్టర్‌పై ద్రాక్షారామ వెళ్లాడు. దారి మధ్యలో పడి ఉన్న బ్యాగ్‌ను తీసి చూడగా అందులో రెండు ల్యాప్‌టాప్‌లున్నాయి. వెంటనే అంగర పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. ఆ బ్యాగ్ హైదరాబాద్‌కు చెందిన చిట్టూరి రజినికాంత్‌దిగా పోలీసులు నిర్ధారించారు. అంగర పోలీసు స్టేషన్‌లో ఎస్సై జి.చంటి సమక్షంలో ల్యాప్‌టాప్‌లను డ్రైవర్ నాగబాబు చేతుల మీదుగా రజినీకాంత్‌కు అప్పగించారు. డ్రైవర్ నాగబాబును బాధితుడు, పోలీసులు అభినందించారు.

వైభవంగా కోదండరామ వార్షికోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మాచవరం శివారు చప్పిడివారిపాలెంలో వేంచేసిన కోదండరామ స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కలశారాధన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధ చేపట్టారు. స్వామి వారిని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, నాయకులు విత్తనాల శేఖర్ దర్శించుకున్నారు.

కుంగ్‌ఫూ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కుంగ్‌ఫూ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. ఇటీవల విజయవాడలో జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు జరిగాయి. మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు టి.అబ్బులు ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించారు. ఆ విద్యార్థులను మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు అభినందించారు.

శ్రీరామ సప్తాహం ప్రారంభం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలోని రామాలయం వద్ద ఆదివారం శ్రీరామ సప్తాహ తొమ్మిదో మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 12 నుంచి 17 వరకూ నిర్వహించే ఈ సప్తాహంలో కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధి గాంచిన భజన కళాకారులు పాల్గొని శ్రావ్యమైన భక్తి కీర్తనలు ఆలపిస్తున్నారు. తొలుత దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం పూజలను ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.